తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శుక్రవారం-03-ఏప్రిల్-2026 | సంపుటి : 3 | సంచిక : 305 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


## పుదుచ్చేరి ఎన్నికల ప్రచారంలో

# డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



- కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం వ్యూహరచన చేసిన భట్టి
- ఖర్గే భారీ బహిరంగ సభ ఏర్పాట్లపై ప్రత్యేక సమీక్ష
- మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటన

**పుదుచ్చేరి, ఏప్రిల్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల వేడి తారస్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు గురువారం పుదుచ్చేరిలో పర్యటించి, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. స్థానిక ఎన్నికల ప్రచారం, సభల నిర్వహణ మరియు ఎన్నికల వ్యూహాలపై అక్కడి నేతలతో కలిసి ఆయన కీలక సమావేశం నిర్వహించారు. తెలంగాణలో కాంగ్రెస్ సాధించిన విజయాన్ని పుదుచ్చేరిలో కూడా పునరావృతం చేసేలా పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని భట్టి విక్రమార్క స్థానిక నాయకత్వానికి దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఈ నెల 4వ తేదీన పుదుచ్చేరిలోని ఓర్లిన్‌పేట్ అసెంబ్లీ నియోజకవర్గంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభ ఏర్పాట్లను ఉప ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు.

మిగతా 2లో..



# ఫ్యూచర్ సిటీ నిర్మాణ పనులపై ముఖ్యమంత్రి సమీక్ష

**భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుల పురోగతిపై పరిశీలన**

**ఎఫ్‌సీడీఏ కార్యాలయ నిర్మాణాలపై సూచనలు**

**స్కిల్స్ యూనివర్సిటీ పనులను వేగవంతం చేయాలని ఆదేశాలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పరిశీలించారు. ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ కార్యాలయం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ భవనాల నిర్మాణ పురోగతిని సమీక్షించారు.

ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ అథారిటీ కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి, భవనాల డిజైన్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆధునిక సదుపాయాలతో నిర్మాణాలు చేపట్టాలని అధికారులకు సూచనలు చేశారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి సంబంధించిన భవన సముదాయాలను కూడా పరిశీలించారు. పనులు నిర్దిష్ట గడువులో పూర్తయ్యేలా వేగవంతం చేయాలని ఆదేశించారు.

మిగతా 2లో..



# భూభారతి పోర్టల్‌తో భూమి సేవలకు కొత్త దిశ

**45 రోజుల తర్వాత జిల్లాకో మండలంలో అమలు**

**ప్రతి సర్వే నంబర్‌కు భూధార్ కేటాయింపు**

**సాదాబైనామాలకు త్వరిత పరిష్కారం లక్ష్యం**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**రంగారెడ్డి, ఏప్రిల్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో భూమి, సర్వే, రిజిస్ట్రేషన్ సేవలను ఒకే వేదికపైకి తీసుకువస్తూ రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను 45 రోజుల పాటు పరిశీలించి, అవసరమైన మార్పులు చేసి జిల్లాకో మండలంలో అమలు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. గురువారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలం మిఠాయిపల్లి గ్రామంలో జరిగిన గ్రామసభలో ఆయన ఈ పోర్టల్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలో రెవెన్యూ శాఖలో విప్లవాత్మక సంస్కరణలు చేపడుతున్నామని తెలిపారు.

మిగతా 2లో..



## లోక్‌సభలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు గళం

2లో

విమానాశ్రయాలపై చర్చ

శంషాబాద్ విమానాశ్రయంలో రెండో టెర్మినల్ పూర్తి చేయాలని విన్నపం

తెలంగాణలో కొత్త విమానాశ్రయాల కోసం భూసేకరణ జరపాలని డిమాండ్

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు విజ్ఞప్తి చేసిన ఎంపీ



## మూసీ ప్రాజెక్టుపై ధ్వజమెత్తిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

2లో

డీపీఆర్ లేకుండా రూ. 1.5 లక్షల కోట్ల ఖర్చు ఎలా?

లండన్, సియోల్ నగరాల ప్రస్తావనపై సీఎం రేవంత్‌కు ప్రశ్నల వర్షం

బాధితులతో చర్చలు జరపకుండా ప్రాజెక్టు చేపట్టడంపై అభ్యంతరం

లక్షలాది మంది నిరాశ్రయులయ్యే ప్రమాదం ఉందని ఆందోళన



## నేను బతికుండగా.. డంపింగ్ యార్డ్ పెట్టనివ్వను

హుజురాబాద్ డంపింగ్ యార్డ్ ప్రతిపాదనపై పాడి కౌశిక్ రెడ్డి సమరశంఖం

తాను బతికుండగా డంపింగ్ యార్డ్ పెట్టనివ్వనని భీష్మ ప్రతిజ్ఞ

ఏప్రిల్ 7, 8 తేదీల్లో నిరసన దీక్షకు పిలుపునిచ్చిన ఎమ్మెల్యే

2లో

ఏప్రిల్ 3న హుజురాబాద్ బంద్‌ను విజయవంతం చేయాలని విజ్ఞప్తి

# గ్రూప్-1 నియామకాలకు గ్రీన్ సిగ్నల్

- సుప్రీంకోర్టు పిటిషన్లను కొట్టివేత
- హైకోర్టు ఉత్తర్వులకు మద్దతు
- అభ్యర్థులపై ఆరోపణలకు చెక్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** టీజీపీఎస్సీ నిర్వహించిన 563 గ్రూప్ 1 పోస్టుల నియామకాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో నియామక ప్రక్రియకు సంబంధించిన అనిశ్చితి తొలగిపోయి, అభ్యర్థులకు ఊరట లభించింది. ఈ తీర్పుతో నియామక ప్రక్రియ చట్టబద్ధతను మరోసారి ధృవీకరించినట్లు అయింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు సమర్థించింది. హైకోర్టు నిర్ణయం సరైనదేనని స్పష్టం చేస్తూ, పిటిషనర్ల వాదనలను కోర్టు తిరస్కరించింది. దీంతో ఇప్పటికే చేపట్టిన నియామక ప్రక్రియకు పూర్తి స్థాయి మద్దతు లభించింది. గ్రూప్ 1 నియామకాలపై వచ్చిన ఆరోపణలు, వివాదాల నేపథ్యంలో ఈ తీర్పు కీలకంగా మారింది. అభ్యర్థులపై చేసిన ఆరోపణలకు న్యాయస్థానం స్పష్టమైన సమాధానం ఇచ్చినట్లయింది.



మిగతా 2లో..

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం

**పేదల సంక్షేమమే లక్ష్యమన్న మంత్రి దామోదర్**

**ఆందోల్ మండలంలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' గ్రామసభ**

**మహిళా సంఘాలకు రూ. 3.50 కోట్ల రుణాలు, వడ్డీ సబ్సిడీ అందజేత**

**అల్మాయిపేట కొత్త కాలనీకి అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని హామీ**



**సంగారెడ్డి, ఏప్రిల్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం అల్మాయిపేట గ్రామంలో గురువారం నిర్వహించిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' గ్రామసభలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ గీతంతో ప్రారంభమైన ఈ సభలో మంత్రి ముగ్గురు లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి జిల్లా కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి శంకుస్థాపన చేశారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# లోక్‌సభలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు గళం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** లోక్‌సభలో జరిగిన జీరో అవర్ చర్చలో మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు తెలంగాణలోని విమానయాన రంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై గళమెత్తారు. భాగ్యనగరానికి తలమానికమైన శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ఒక్కటే ప్రస్తుతం అందుబాటులో ఉందని, పెరిగిన ప్రయాణికుల రద్దీ దృష్ట్యా అది సరిపోవడం లేదని ఆయన సభ దృష్టికి తీసుకెళ్లారు. శంషాబాద్ విమానాశ్రయ వార్షిక సామర్థ్యం 40 లక్షల ప్రయాణికులు మాత్రమే కాగా, 202526 గణాంకాల ప్రకారం ఇప్పటికే 35 లక్షల మంది ప్రయాణించారని ఆయన గణాంకాలను వివరించారు. ఈ నేపథ్యంలో విమానాశ్రయ విస్తరణ మరియు మౌలిక సదుపాయాల కల్పన అత్యవసరమని ఆయన నొక్కి చెప్పారు.

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య విమానాశ్రయాల సంఖ్యలో ఉన్న వ్యత్యాసాన్ని రఘునందన్ రావు ఈ సందర్భంగా ప్రస్తావించారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఎనిమిది విమానాశ్రయాలు అందుబాటులో ఉండగా, తెలంగాణలో కేవలం ఒకటి మాత్రమే ఉండటం శోచనీయమని ఆయన పేర్కొన్నారు. అయితే, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన కొనియాడారు. కేంద్రం ఇప్పటికే వరంగల్ (మామునూరు) మరియు ఆదిలాబాద్‌లలో నూతన విమానాశ్రయాల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసిందని, ఇది రాష్ట్ర అభివృద్ధికి శుభపరిణామమని ఆయన సభకు వివరించారు.

కేంద్రం నుంచి అనుమతులు లభించినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ సహకారం లేనిదే పనులు ముందుకు సాగవని ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు. మామునూరు మరియు ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణం వేగవంతం కావాలంటే తెలంగాణ ప్రభుత్వం తక్షణమే స్పందించి భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భూసేకరణ విషయంలో జాప్యం జరిగితే ప్రాజెక్టులు ఆలస్యమై రాష్ట్రం నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. విమానయాన సౌకర్యాలు మెరుగుపడితే ఉత్తర తెలంగాణ మరియు వరంగల్ ప్రాంతాల్లో పారిశ్రామికాభివృద్ధి మరింత ఊపందుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెలుగు వారైన కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే ఈ విమానాశ్రయాల నిర్మాణం పూర్తి కావాలని రఘునందన్ రావు ఆకాంక్షించారు. కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి తెలంగాణ ప్రాజెక్టులకు పెద్దపీట వేయాలని ఆయన కోరారు. ముఖ్యంగా శంషాబాద్ విమానాశ్రయంలో పెరిగిన రద్దీని తట్టుకునేందుకు రెండో టెర్మినల్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సౌకర్యాలు కల్పిస్తేనే హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరంగా తన గుర్తింపును కాపాడుకోగలదని ఆయన పేర్కొన్నారు. రఘునందన్ రావు ప్రసంగం లోక్‌సభలో అందరి దృష్టిని ఆకర్షించింది. తెలంగాణలోని రవాణా రంగ సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన చూపిన చొరవపై హర్షం వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం మరియు కేంద్రం సమన్వయంతో పనిచేస్తేనే విమానాశ్రయాల కల సాకారమవుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాబోయే రోజుల్లో మామునూరు, ఆదిలాబాద్ విమానాశ్రయాల ఏర్పాటుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ మేరకు స్పందిస్తాయో వేచి చూడాలి. విమానయాన సౌకర్యాల విస్తరణ ద్వారా తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు కొత్త జవజీవాలు వస్తాయని ఎంపీ రఘునందన్ రావు తన ప్రసంగంలో ఆశాభావం వ్యక్తం చేశారు.

# గ్రూప్-1 నియామకాలకు గ్రీన్ సిగ్నల్




(మొదటి పేజీ తరువాయి)

దీనివల్ల అభ్యర్థులపై ఉన్న అనుమానాలకు తెరపడింది. ఈ తీర్పుతో నియామకాలకు సంబంధించిన అన్ని అడ్డంకులు తొలగిపోయాయి. త్వరలో నియామక ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. అభ్యర్థులు తమ నియామకాల కోసం ఎదురుచూస్తున్నారు.

ఇప్పటికే ఈ అంశంపై వివిధ స్థాయిల్లో చర్చలు జరిగినప్పటికీ, సుప్రీంకోర్టు తుది తీర్పు ఇచ్చడంతో వివాదానికి ముగింపు పలికింది. న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం మరింత బలపడినట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ తీర్పు ద్వారా అభ్యర్థులపై తప్పుడు ఆరోపణలు చేసిన వారికి గట్టి సందేశం వెళ్లింది. న్యాయపరంగా నిజం నిలిచిందని, అర్హులైన వారికి న్యాయం జరిగినట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని, పేదల అభ్యున్నతే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఉచిత విద్యుత్ మరియు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన భరోసా ఇచ్చారు.

మహిళా సాధికారత మరియు ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి దామోదర్ పేర్కొన్నారు. గ్రామంలోని 28 స్వయం సహాయక సంఘాలకు రూ. 3.50 కోట్ల రుణాలు అందించడంతో పాటు, రూ. 2.50 లక్షల వడ్డీ సబ్సిడీని కూడా విడుదల చేసినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో మహిళలకు 30 రకాల ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అల్మాయిపేటలోని సర్వే నంబర్ 513లో కొత్త కాలనీ ఏర్పాటుకు ప్రజలు ముందుకు వస్తే, అక్కడ రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ మరియు నీటి ట్యాంక్ వంటి అన్ని మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. గ్రామ సమస్యల పరిష్కారం కోసం నిధుల మంజూరుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. హైవే నుండి అల్మాయిపేట-కొన్యాల వరకు బీటీ రహదారి నిర్మాణంతో పాటు, గ్రామంలో అండర్ డ్రైనేజీ మరియు సీసీ రోడ్ల పనులను వెంటనే చేపడతామని వెల్లడించారు. గతంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేయాలని, అవసరమైతే తాను వ్యక్తిగతంగా కూడా సహకరిస్తానని ఆయన పేర్కొన్నారు. అలాగే, పేదలకు చెందిన 40 ఎకరాల అసైన్డ్ భూమి తప్పుగా రిజిస్ట్రేషన్ అయిన ఉదంతంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వెంటనే ఆ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి అసలు లబ్ధిదారులకు భూమిని అప్పగించాలని ఆర్డీవోను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, రాబోయే రెండు నెలల్లో 10 శాఖల ద్వారా చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు చురుకుగా పాల్గొనాలని కోరారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద జిల్లాలో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని, త్వరలోనే పాఠశాల పిల్లలకు రాగి జావాతో బ్రేక్‌ఫాస్ట్ మరియు ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, స్థానిక సర్పంచ్, వివిధ శాఖల అధికారులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. మంత్రి స్వయంగా ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం మరియు సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడం పట్ల అల్మాయిపేట గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# భూభారతి పోర్టల్‌తో భూమి సేవలకు కొత్త దిశ

(మొదటి పేజీ తరువాయి)

ఆమనగల్‌తో పాటు ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, నారాయణపేట జిల్లా కొస్గి మండలాల్లో ఈ పోర్టల్‌ను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ద్వారా ప్రజలు ఎటువంటి కార్యాలయాలకు వెళ్లకుండా తమ స్మార్ట్ ఫోన్ ద్వారానే అన్ని సేవలను పొందవచ్చని మంత్రి తెలిపారు. భూమికి సంబంధించిన రికార్డులు, నమోదు, సర్వే వివరాలు ఒకే వేదికలో అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ విధానం ద్వారా పారదర్శకత పెరుగుతుందని, అవినీతి తగ్గుతుందని అభిప్రాయపడ్డారు.

గతంలో అమలైన విధానాల కారణంగా 9.52 లక్షల సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి త్వరిత గతిన పరిష్కారం చూపిస్తామని మంత్రి స్పష్టం చేశారు. సాగులో ఉన్న భూములపై హక్కులను ధృవీకరించి, అర్హులకే పట్టాలు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామాలు మున్సిపాలిటీలుగా మారిన ప్రాంతాల్లో కూడా ఈ విధానం వర్తించేలా మార్పులు చేస్తున్నామని చెప్పారు.

భూమి వివరాలకు ఆధార్ తరహాలో ప్రతి సర్వే నంబర్‌కు భూధార్ నంబర్ కేటాయించనున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా విభజించి జీపీవోలను నియమించడం, వేలాది సర్వేయర్లకు శిక్షణ ఇవ్వడం వంటి చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఆధునిక సాంకేతికతతో సర్వే నిర్వహణ కోసం రోవర్ పరికరాలను వినియోగిస్తున్నామని తెలిపారు.

పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. గత పాలనలో జరిగిన లోపాలను సరిదిద్దుతూ ప్రజలకు సులభమైన సేవలు అందించడమే లక్ష్యమన్నారు. త్వరలో ఈ నియోజకవర్గంలో సబ్ రిజిస్ట్రార్, తహశీల్దార్ కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి, రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి లోకేష్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీ నిర్మాణ పనులపై ముఖ్యమంత్రి సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులకు అత్యుత్తమ సదుపాయాలు కల్పించేలా నిర్మాణాలు ఉండాలని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి కీలకమని ముఖ్యమంత్రి తెలిపారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. ముఖ్యమంత్రి వెంట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, స్కిల్స్ యూనివర్సిటీ వైస్ చాన్సెలర్ వీఎల్వీఎస్ఎస్ సుబ్బారావు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టుల అమలు వేగవంతం చేయాలని, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ ద్వారా తెలంగాణను అభివృద్ధిలో ముందంజలో నిలపాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

# పుదుచ్చేరి ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

(మొదటి పేజీ తరువాయి)

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఈ సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఆయన సూచించారు. సభా ప్రాంగణం వద్ద భద్రత, ప్రజల సౌకర్యాలు మరియు జన సమీకరణపై అధికారులతో మరియు పార్టీ ప్రతినిధులతో చర్చించారు. ఖర్గే రాకతో పుదుచ్చేరి రాజకీయాల్లో కాంగ్రెస్ వైపు మొగ్గు పెరుగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెంట తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా ఈ సమీక్షా సమావేశాల్లో పాల్గొన్నారు. ఇద్దరు కీలక నేతలు కలిసి పుదుచ్చేరి ఎన్నికల బాధ్యతలను భుజాన వేసుకోవడం విశేషం. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన సీనియర్ నాయకుల సమక్షంలో జరిగిన ఈ భేటీ, స్థానిక కాంగ్రెస్ అభ్యర్థులకు మరియు కార్యకర్తలకు కొండంత అండగా నిలిచింది. ఎన్నికల వ్యూహరచనలో భాగంగా ప్రతి ఇంటికీ కాంగ్రెస్ మేనిఫెస్టోను తీసుకెళ్లాలని, ప్రజల సమస్యలపై పోరాడాలని వారు పిలుపునిచ్చారు. పుదుచ్చేరిలోని రాజకీయ పరిణామాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ, ప్రత్యర్థి పార్టీల ఎత్తుగడలను చిత్తు చేసేలా కాంగ్రెస్ తన వ్యూహాలను సిద్ధం చేస్తోంది. ఏఐసీసీ ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై భట్టి విక్రమార్క వివరించారు. ముఖ్యంగా యువత మరియు మహిళా ఓటర్లను ఆకట్టుకునే అంశాలపై ఈ సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. ఎన్నికల ప్రచార గడువు ముగిసేలోపు ప్రతి నియోజకవర్గంలోనూ పర్యటించి అభ్యర్థుల గెలుపుకు కృషి చేస్తామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరియు పాలనపై పుదుచ్చేరి ప్రజల్లో ఆసక్తి నెలకొందని, అది ఎన్నికల్లో తమకు కలిసి వస్తుందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. భట్టి విక్రమార్క మరియు పొన్నం ప్రభాకర్ పర్యటనతో పుదుచ్చేరి కాంగ్రెస్‌లో నూతనోత్తేజం కనిపిస్తోంది. భారీ బహిరంగ సభ సన్నాహకాల్లో భాగంగా ఇప్పటికే పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో పుదుచ్చేరి గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే తమ ఏకైక లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన ప్రసంగంలో ఉద్ఘాటించారు.

# నేను బతికుండగా.. డంపింగ్ యార్డ్ పెట్టనివ్వను



**హుజురాబాద్, ఏప్రిల్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలోని సిర్సపల్లి సమీపంలో ప్రభుత్వం ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్ అంశంపై స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను బతికుండగా హుజురాబాద్ గడ్డపై డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయనిచ్చే ప్రసక్తి లేదని ఆయన గురువారం స్పష్టం చేశారు. బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు మరియు నాయకులతో కలిసి డంపింగ్ యార్డ్ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన ఆయన, ఈ సందర్భంగా ప్రభుత్వ ఉత్తర్వులను బహిరంగంగా చదివి వినిపించారు. స్వయంగా ముఖ్యమంత్రే ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారని, ఇది ప్రజల జీవన్మరణ సమస్య అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణం దెబ్బతిని, ప్రజలు ఊపిరి పీల్చుకోవడం కూడా కష్టమయ్యే ఈ ప్రాజెక్టును ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్ ప్రతిపాదనకు నిరసనగా ఈ నెల 3వ తేదీన (శుక్రవారం) హుజురాబాద్ బంద్‌కు కౌశిక్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ బంద్‌ను రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు, వ్యాపారులు మరియు స్వచ్ఛంద సంస్థలు విజయవంతం చేయాలని కోరారు. దవాఖానాలు, మెడికల్ షాపులు వంటి అత్యవసర సేవలు మినహా మిగతా అన్ని వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా మూసివేసి ప్రభుత్వానికి తమ నిరసన తెలపాలని విజ్ఞప్తి చేశారు. శాంతియుతంగా జరిగే ఈ బంద్‌ను అడ్డుకోవాలని పోలీసులు ప్రయత్నించవద్దని, ఇది ప్రజలందరి సమస్య అని ఆయన పేర్కొన్నారు. తొలుత 4వ తేదీన బంద్ అనుకున్నప్పటికీ, తనకు సిఐడి విచారణ ఉన్నందున చట్టాన్ని గౌరవిస్తూ ఒక రోజు ముందుగానే బంద్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోకపోతే ఏప్రిల్ 7 మరియు 8 తేదీల్లో తాను స్వయంగా దీక్షకు దిగుతానని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రకటించారు. జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే దీక్షా శిబిరంలో ఉదయం నుండి సాయంత్రం వరకు కూర్చుని నిరసన తెలుపుతానని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ విషయంపై ముఖ్యమంత్రితో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ మరియు అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లకు లేఖలు రాసినట్లు ఆయన వివరించారు. అసెంబ్లీలో కూడా ముఖ్యమంత్రికి దండం పెట్టి మరీ హుజురాబాద్ ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని కోరానని, అయినా ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్లడం సరికాదని ఆయన విమర్శించారు. డంపింగ్ యార్డ్ కమ్ ఎనర్జీ ప్లాంట్ పనుల కోసం ఎవరూ టెండర్లు వేయవద్దని కౌశిక్ రెడ్డి కాంట్రాక్టర్లను హెచ్చరించారు. హైదరాబాద్‌లోని జవహర్ నగర్ ప్లాంట్ వల్ల అక్కడి ప్రజలు పడుతున్న నరకాన్ని అందరూ చూస్తున్నారని, హుజురాబాద్‌కు ఆ గతి పట్టనివ్వబోమని స్పష్టం చేశారు. ఒకవేళ ఎవరైనా టెండర్లు వేస్తే అడ్డుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. హుజురాబాద్ గడ్డ పోరాటాలకు నిలయమని, తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించిన ఈ ప్రాంత ప్రజలు తమ అస్తిత్వం కోసం మళ్లీ పోరాడతారని ఉద్వేగంగా చెప్పారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలంతా ఏకమై ఈ డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

# మూసీ ప్రాజెక్టుపై ధ్వజమెత్తిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**హుజురాబాద్, ఏప్రిల్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నేత డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురువారం తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర నివేదిక ఇప్పటివరకు విడుదల చేయకుండానే, లక్షన్నర కోట్ల రూపాయల భారీ ప్రాజెక్టును ఎలా చేపడతారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదే పదే లండన్ థేమ్స్ నది, దక్షిణ కొరియాలోని సియోల్, సింగపూర్ నగరాల గురించి మాట్లాడుతున్నారని, అయితే అక్కడ అనుసరించిన పద్ధతులకు, ఇక్కడ జరుగుతున్న తీరుకు అస్సలు పొంతన లేదని ఆయన విమర్శించారు.

లండన్‌లోని థేమ్స్ నది పునరుజ్జీవన ప్రాజెక్టు 150 ఏళ్లుగా కొనసాగుతూనే ఉందని, అటువంటి భారీ ప్రక్రియను ముఖ్యమంత్రి కేవలం రెండున్నరేళ్లలో ఎలా పూర్తి చేస్తారని ప్రవీణ్ కుమార్ నిలదీశారు. అలాగే సియోల్ నగరంలో నదీ పునరుజ్జీవన పనులు ప్రారంభించే ముందు, అప్పటి పాలకులు సుమారు 4200 సార్లు అక్కడి ప్రజలతో చర్చలు నిర్వహించి వారి అభిప్రాయాలను సేకరించారని గుర్తు చేశారు. మరి తెలంగాణలో మూసీ పరివాహక ప్రాంత బాధితులతో ముఖ్యమంత్రి ఎందుకు చర్చలు జరపడం లేదని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో బాధితుల గోడు వినకుండా నిర్ణయాలు తీసుకోవడం తగదని హితవు పలికారు.

ఈ ప్రాజెక్టు వల్ల లక్షలాది మంది పేదలు, సామాన్యులు తమ గూడు కోల్పోయి అడ్డాకూలీలుగా, నిరాశ్రయులుగా మారే ప్రమాదం ఉందని ప్రవీణ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లను కూల్చివేయడం సమంజసం కాదని ఆయన పేర్కొన్నారు. మూసీ సుందరీకరణ అనేది ఒక పెద్ద దోపిడీ అని, దీని వెనుక ఉన్న అసలు వాస్తవాలను త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు వివరిస్తామని ఆయన హెచ్చరించారు. ప్రజలను చైతన్యవంతులను చేసి, ప్రభుత్వం చేయబోతున్న ఈ దోపిడీని అడ్డుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

ప్రభుత్వం ఇప్పటికైనా మొండివైఖరి వీడి, ప్రాజెక్టు వివరాలను బహిర్గతం చేయాలని ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. బాధితులకు సరైన పునరావాసం మరియు నష్టపరిహారం కల్పించకుండా ఒక్క అడుగు కూడా ముందుకు వేయనివ్వబోమని హెచ్చరించారు. అభివృద్ధి పేరుతో పేదల పొట్ట కొట్టడం కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని ఆయన విమర్శించారు. ఈ ప్రాజెక్టుపై రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి తాము సిద్ధమవుతున్నామని, మూసీ బాధితుల పక్షాన తమ పార్టీ నిలబడుతుందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో పెను దుమారం రేపుతున్నాయి.

## సర్వాయి పాపన్న ఆశయాలను నెరవేర్చాలి...



- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. శ్రీజ

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్- 2(తెలంగాణ ముచ్చట్లు ):** సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరు కృషి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ అన్నారు. గురువారం సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా ట్యాంక్ బండ్ వద్ద గల ఆయన విగ్రహానికి అదనపు కలెక్టర్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, సర్వాయి పాపన్న గౌడ్ సామాజిక న్యాయం, సమానత్వం కోసం చేసిన పోరాటం నేటి తరాలకు మార్గదర్శకమని తెలిపారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి ఆదర్శప్రాయమని అన్నారు.

ఈ కార్యక్రమంలో బిసి సంఘ నాయకులు, తెలంగాణ జిల్లా గౌడ సంఘ అధ్యక్షులు కత్తి నెహ్రూ గౌడ్, బచ్చు విజయ్ కుమార్, నూతి సత్యనారాయణ గౌడ్ డి.సి.సి. అధ్యక్షులు, పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, అమరగాని వెంకన్న, వడ్డెబోయిన నరసింహ గౌడ్, మార్కం లింగయ్య గౌడ్, ఉడుగు శ్రీనివాస గౌడ్, డాక్టర్ శ్రీనివాస గౌడ్, డాక్టర్ రాజశేఖర్ గౌడ్, కోడి లింగయ్య, పగడాల నాగరాజు, షేక్ షకినా, అంబాల వెంకటేశ్వరరావు, తోడేటి దుర్గాప్రసాద్, పెరుగు వెంకటరమణ యాదవ్, జక్కుల వెంకటరమణ, బెల్లం కొండ శరత్, బండి నాగేశ్వరరావు, పెల్లూరి విజయ్ కుమార్, రమణ కుమార్, రవి కుమార్, కొప్పెల్లి శ్రీనివాస్, సమ్మయ్య, బడపట్ల సుదర్శన్, యాదాల నాగేశ్వరరావు, జ్యోత్స్న నాయక్, బత్తిని రాజు, మురళీ కృష్ణ, గంగరాజు, రామకృష్ణ, మాధవి, సతీష్, ముత్యాల రావు, వీరయ్య, మొగలయ్య, చందర్ రావు, రామకృష్ణ, బిసి కుల సంఘ నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

- డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి



**వనపర్తి,ఏప్రిల్2(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రజా ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు గోపాల్‌పేట్ మండలం జయన్న తిరుమలాపురం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి హాజరయ్యారు .ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ 2005కు ముందు జయన్న తిరుమలాపురం గ్రామ ప్రజలు వలసలు వెళ్లేవారని, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందడంతో గ్రామ ప్రజలు వ్యవసాయం, పాడి పరిశ్రమల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వాల కాలంలో గ్రామపంచాయతీ భవనం, సబ్‌స్టేషన్, బస్ షెల్టర్, వెటర్నరీ ఆసుపత్రి, దేవాలయాల పునర్నిర్మాణం, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు.ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతులకు రుణమాఫీ, వడ్లకు బోనస్, చెరువుల పునరుద్ధరణ, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ప్రభుత్వ ఉద్యోగాల కల్పన వంటి పథకాలతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నదని తెలిపారు. గ్రామ అభివృద్ధికి విద్య ముఖ్యమని, పిల్లలను ఉన్నత విద్యకు ప్రోత్సహించాలని సూచించారు. గ్రామంలో ఉన్న బెల్ట్ షాపులను మహిళలు ముందుండి మూసివేయాలని విజ్ఞప్తి చేశారు.జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి అభివృద్ధి దిశగా తీసుకువెళ్తుందని తెలిపారు.గ్రామ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చి ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపుతున్నారని, భవిష్యత్తులో ఆర్థికంగా బలోపేతం అవుతారని అన్నారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, గ్రామ సర్పంచ్ జ్యోతి గోపాల్, ఉప సర్పంచ్ రాజు, అమరేందర్ రెడ్డి, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పుట్టు చీర మహోత్సవానికి హాజరైన చిన్నారెడ్డి



**పెద్దమందడి,ఏప్రిల్2(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం జగత్‌పల్లి గ్రామంలో ఆంధ్ర జ్యోతి జిల్లా ఇంచార్జ్ భాస్కర్ కుమార్తె పుట్టు చీర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారి ఆరాధ్యకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు.ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తు వెలుగొందాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో పాటు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, జగత్‌పల్లి గ్రామ సర్పంచ్ వెంకన్న యాదవ్, సింగల్ విండో డైరెక్టర్ మన్యం, పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, సీనియర్ నాయకులు శేఖర్ రెడ్డి, నందిమల్ల రాము, ద్వారపోగు విజయ్ బాబు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లి ఆరోగ్య కేంద్రంపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- పేషంట్లకు మెరుగైన సేవలు అందించాలి
- 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండాలని ఆదేశం



**మేడ్చల్–మల్కాజిగిరి, ఏప్రిల్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** పేషంట్లు నమ్మకంతో ఆసుపత్రులకు వస్తున్న నేపథ్యంలో వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించడం వైద్యుల బాధ్యత అని మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. గురువారం కూకట్పల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎం అండ్ హెచ్ఓ ఉమాగౌరి తో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పనితీరు, సౌకర్యాలపై సమగ్రంగా సమీక్షించారు.రోజువారీ పేషంట్ల సంఖ్య, వారి వివరాలను రిజిస్టర్లలో నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించిన కలెక్టర్, అన్ని వివరాలు కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఆసుపత్రిలో ఉన్న సమస్యలు, అవసరాలపై మెడికల్ ఆఫీసర్‌ను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు.ఆసుపత్రికి అవసరమైన మరమ్మత్తులు, మౌలిక వసతులు, డెలివరీ సేవలకు సంబంధించిన సిబ్బంది కొరత వంటి అంశాలను ప్రస్తావించగా, వాటిపై వెంటనే ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు.పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, శానిటేషన్ సిబ్బందితో సమన్వయం చేసుకుని ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. మందుల గదిని తనిఖీ చేసి, ఎక్స్‌పైరీ తేదీలను పరిశీలించి మాత్రమే పేషంట్లకు మందులు అందించాలని సిబ్బందికి తెలిపారు.ఆసుపత్రుల్లో సేవల నాణ్యత పెంచేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# పెద్ద తండలో సన్న బియ్యం పంపిణీ

రెగ్యులర్ రేషన్ డీలర్ కోసం డిమాండ్



**వరంగల్,ఏప్రిల్02(తెలంగాణ ముచ్చట్లు):** వరంగల్ జిల్లా సంగెం మండలం పెద్ద తండ గ్రామపంచాయతీలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమమును సర్పంచ్, ఉపసర్పంచ్ గుగులోత్ వినోద్ రవీందర్ నాయక్ లు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో రేషన్ డీలర్ షాపు లేకపోవడం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం షాపూర్ డీలర్‌ను ఇన్‌చార్జిగా నియమించినప్పటికీ, పెద్ద తండ గ్రామంలోనే శాశ్వత డీలర్ షాపు ఏర్పాటు చేయాలని కోరారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా పేదల ఆకలి తీర్చేందుకు సన్న బియ్యం పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ నెలతో మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి అందజేయడం ద్వారా పేదలకు ఉపశమనం కలిగిందన్నారు.గ్రామ ప్రజలు కూడా పెద్ద తండలో రేషన్ డీలర్ షాపును మంజూరు చేయాలని కోరుతూ సర్పంచ్, ఉపసర్పంచ్‌లను విజ్ఞప్తి చేశారు. ఈ అంశాన్ని ఎమ్మెల్యే, మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి షాపు ఏర్పాటు జరిగేలా చర్యలు తీసుకుంటామని సర్పంచ్, ఉపసర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, డీలర్లు, లబ్ధిదారులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# చిల్పూర్‌లో పండిట్ దిన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ నిర్వహణ



**చిల్పూర్, ఏప్రిల్ 02 (తెలంగాణ ముచ్చట్లు):-** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చిల్పూర్ మండలంలో పండిట్ దిన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్-2026 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వరంగల్ పార్లమెంట్ కోకన్వీనర్ ఇనుగాల యుగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనగాం జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ హాజరై మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లో విస్తరించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర నాయకులు ఉడుగుల రమేష్, బొజ్జపెల్లి శుభాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐలోని అంజిరెడ్డి, జిల్లా నాయకుడు తోకల సంపత్ రెడ్డి, జిల్లా ప్రభారీ బల్ల శ్రీనివాస్, జిల్లా కిసాన్ మోర్చా నాయకుడు గడ్డం రాజు, జిల్లా మీడియా కన్వీనర్ కాదుగాయ రమేష్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాల్నే శ్రీనివాస్ గౌడ్, గాజుల సంపత్ పాల్గొన్నారు.

అలాగే స్టేషన్ ఘనపూర్ మండల అధ్యక్షుడు సట్ల వెంకటరమణ గౌడ్, చిల్పూర్ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్, భూక్య అనిల్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శులు వెలిశాల శ్రీనివాస్, పోలబోయిన జోగులు, సోషల్ మీడియా మండల కోకన్వీనర్ ముక్కెర రమేష్‌యాదవ్, మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఊరటి రాజు ముదిరాజ్, చిల్పూర్ బూత్ అధ్యక్షులు దామెర ప్రశాంత్, కట్ల అనిల్ కుమార్ ముదిరాజ్, శాగ పవన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, కార్యకర్తల శిక్షణ, ప్రజా సమస్యలపై స్పందన, ప్రభుత్వ విధానాలపై అవగాహన కల్పించడం వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు...

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ -02(తెలంగాణ ముచ్చట్లు):** భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఇందులో భాగంగా ప్రజలకు పారదర్శకంగా సులభతరమైన సేవలు అందించడానికి ల్యాండ్ సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు క్రిందకు తెస్తూ ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్ ను ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్ క్రింద ఖమ్మం జిల్లాలోని కూసుమంచి మండలంలో ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

తహసిల్దార్ కార్యాలయం వద్ద భూములు రిజిస్ట్రేషన్ చేసే సమయంలో సర్వే మ్యాప్ లు అందించే దిశగా ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్ రూపొందించామని అన్నారు. కూసుమంచి మండలంలో ఇక నుంచి రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ చేసుకుంటే ఆ వివరాలు సర్వేయర్ కు కూడా వెళ్తుందని అన్నారు. రైతులు ఇంటి వద్ద నుంచి కూడా స్లాట్ బుకింగ్ చేసుకునేలా పోర్టల్ తయారు చేశామని, రైతులు లాగిన్ కాగానే భూమి వివరాలు కనిపిస్తాయని, ఎన్ని ఎకరాలకు సర్వే కావాలో కోరితే అందుకు సంబంధించిన ఫీజు చెల్లించిన తర్వాత గ్రామంలోని లైసెన్స్ సర్వేయర్ లాగిన్ కు వెళ్తాయని, రెండు రోజుల్లో ఆ రైతు భూమికి ఆనుకొని ఉన్న రైతులకు నోటీసులు జారీ చేసి ఏడు రోజుల లోపు సర్వే పూర్తి చేస్తారని, ఈ వివరాలను సర్వేయర్ సిస్టంలో నమోదు చేశాక దరఖాస్తుదారుడైన రైతు సర్వే మ్యాప్ నకు యూనిక్, భూధార్ నెంబర్లు కేటాయిస్తారని భూభారతి పోర్టల్ లో కూడా వివరాలు నిక్షిప్తమవుతాయని అన్నారు.

సర్వే పూర్తయిన తర్వాత సర్వే మ్యాప్ జనరేట్ చేసి పోర్టల్ లో అప్లోడ్ చేస్తారని ఈ ప్రక్రియలు దరఖాస్తు రిజిస్ట్రేషన్ ప్రారంభమైనప్పటి నుంచి పూర్తి వరకు ప్రతి దశలో పౌరుల రిజిస్టర్ మొబైల్ నెంబర్ కు మెసేజ్ వస్తాయని తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు క్రింద ముందుగా కూసుమంచి మండలంలో ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ అమలు చేస్తున్నామని ఇక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా భవిష్యత్తులో మిగిలిన మండలాలకు దీనిని ప్రభుత్వం విస్తరిస్తుందని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# క్రీస్తు త్యాగానికి ప్రతీక గుడ్ ఫ్రైడే

విశ్వశాంతి విద్యాలయంలో ముందస్తు నిర్వహణ.



**సత్తుపల్లి, ఏప్రిల్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** యేసుక్రీస్తు త్యాగాన్ని స్మరించుకునే పవిత్ర దినం గుడ్ ఫ్రైడే అని పట్టణంలో విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు తెలిపారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా పాఠశాలలో గురువారం ముందస్తుగా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు గుడ్ ఫ్రైడే ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న విద్యార్థులు యేసుక్రీస్తు బోధించిన ప్రేమ, క్షమ, దయ, సహనం వంటి విలువలపై ప్రసంగాలు చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే మనుషులకు కష్టకాలంలో ధైర్యంగా ఉండటం, ఇతరులను క్షమించడం, అవసరమైన వారికి సహాయం చేయడం వంటి గొప్ప గుణాలను నేర్పుతుందని పేర్కొన్నారు. విద్యతో పాటు నైతిక, మానవీయ విలువలు కూడా సమానంగా అవసరమని విద్యార్థులకు సూచించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం నరుకుళ్ల సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక






# “కంకర రోడ్డు కానరావడం లేదా?”

- **నరకయాతన పడుతున్న ప్రయాణికులు పట్టించుకోని పాలకులు**
- **పరీక్షల సీజన్, పంటల కాలంలోనూ నిర్లక్ష్యం –**
- **స్టేషన్ ఘనపూర్–తాటికొండ రహదారి దుస్థితి**

**స్టేషన్ ఘనపూర్, ఏప్రిల్2: తెలంగాణ ముచ్చట్లు:** జనగామ జిల్లాలోని స్టేషన్ ఘనపూర్ మండలం కేంద్రం నుండి తాటికొండ గ్రామం వరకు ఉన్న రహదారి ప్రస్తుతం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. గతంలో ఉన్న రోడ్డును తవ్వి కంకర పరిచి వదిలేయడంతో, ప్రయాణం ప్రమాదకరంగా మారింది.

పరీక్షల కాలం కావడంతో ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు ఈ రహదారిపై ప్రయాణించడం కష్టసాధ్యంగా మారింది. సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే నర్సరీ నుండి 9వ తరగతి వరకు పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో చిన్నారులు, తల్లిదండ్రులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇక రైతులు పంటలు కోయించి ట్రాక్టర్లలో తరలించే ఈ సమయంలో రహదారి దుస్థితి మరింత ఇబ్బందులు కలిగిస్తోంది. కంకర రోడ్డుతో ట్రాక్టర్లు దెబ్బతినడం, ఆలస్యాలు జరుగడం వల్ల రైతులకు నష్టాలు ఎదురవుతున్నాయి.

ఆటో డ్రైవర్లు, ట్రాక్టర్ డ్రైవర్లు రోజూ ఈ రహదారిపై ప్రయాణిస్తూ వాహన మరమ్మత్తుల ఖర్చులతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు ప్రతి రోజు ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. “కంకర రోడ్డు కానరావడం లేదా?” అంటూ స్థానికులు పాలకులు, అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగితాలపైనే అభివృద్ధి చూపిస్తూ, వాస్తవ సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ప్రస్తుతం అయినా అధికారులు స్పందించి, కాంట్రాక్టర్లతో మాట్లాడి రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ఆందోళనలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

- **పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**ఉప్పల్, ఏప్రిల్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమాన్ జయంతి సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గంలోని పలు హనుమాన్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి .ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో కలిసి హనుమంతుని దర్శనం చేసుకుని ప్రార్థనలు చేశారు.అలయాల్లో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అనుగ్రహం కోసం ప్రత్యేక పూజలు, హనుమాన్ చాలీసా పఠనం, నామస్మరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాలు భక్తి గీతాలతో మార్మోగాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ శ్రీ హనుమంతుడు భక్తి, శక్తి, ధైర్యానికి ప్రతీకగా నిలుస్తాడని అన్నారు. హనుమాన్ జయంతి కేవలం పండగ మాత్రమే కాకుండా మన జీవితంలో శక్తి, ఆత్మవిశ్వాసం, నిబద్ధతను పెంపొందించే పవిత్ర దినమని పేర్కొన్నారు.ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే గొప్ప గుణాన్ని హనుమంతుడు మనకు నేర్పుతాడని ఆయన అన్నారు. జీవితంలో ఎదురయ్యే కష్టాలు, భయాలను తొలగించి ధైర్యాన్ని నింపే అభయాంజనేయుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ ఉండాలని ఆకాంక్షించారు. అసాధ్యమైన పనులను సుసాధ్యం చేసే శక్తి హనుమంతుని భక్తితోనే సాధ్యమని ఆయన తెలిపారు.ప్రజలందరికీ విజయం, సంతోషం, సంపూర్ణ ఆరోగ్యం కలగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతిని జరుపుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, స్థానిక కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్‌లు

**కట్టుదిట్టమైన భద్రత, ట్రాఫిక్ నియంత్రణ**




**హైదరాబాద్, ఏప్రిల్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** టాటా ఐపీఎల్2026 మ్యాచ్‌లు ఏప్రిల్ 5 నుండి మే 22 వరకు రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, ఉప్పల్‌లో జరగనున్న నేపథ్యంలో పోలీసులు విస్తృత భద్రతా, ట్రాఫిక్ ఏర్పాట్లు చేపట్టారు. సుమారు 39,000 మంది ప్రేక్షకులు హాజరయ్యే అవకాశం ఉండటంతో అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు.పోలీసులు సుమారు 2,000 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇందులో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, సెక్యూరిటీ వింగ్, టిఎస్ఎస్పి/ఏఆర్ ఫోర్సులు, మౌంటెడ్ పోలీస్ బృందాలు పాల్గొంటున్నాయి. స్టేడియం లోపల మరియు వెలుపల 430 సీసీ కెమెరాల ద్వారా నిఘా కొనసాగుతుంది. జాయింట్ కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ చేపట్టనున్నారు. బాంబ్ డిస్పోజల్ టీమ్స్, స్నిఫర్ డాగ్స్‌తో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తారు. ప్రేక్షకుల భద్రత దృష్ట్యా ల్యాప్‌టాప్‌లు, బ్యాగులు, కెమెరాలు, వాటర్ బాటిళ్లు, సిగరెట్లు, లైటర్లు, లోహ వస్తువులు, బైనాక్యులర్లు, పెన్నులు, బ్యాటరీలు, పర్ఫ్యూమ్స్, లేజర్ పాయింటర్లు, బయటి ఆహారం వంటి నిషేధిత వస్తువులను స్టేడియంలోకి అనుమతించరని అధికారులు స్పష్టం చేశారు. స్టేడియం వద్ద క్లోక్ రూమ్ సౌకర్యం లేదని పేర్కొన్నారు.మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా షీ టీమ్స్‌ను ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల కోసం 5 అంబులెన్సులు, 4 ఫైర్ ఇంజన్లు సిద్ధంగా ఉంచారు. ఏప్రిల్ 13 నుంచి జరిగే మ్యాచ్‌లకు డిజిటల్ టికెటింగ్ విధానం అమలు చేయనున్నారు. మ్యాచ్ రోజుల్లో మధ్యాహ్నం 12 గంటల నుండి రాత్రి 11:50 వరకు ఉప్పల్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ ఉండే అవకాశం ఉందని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. భారీ వాహనాలకు ఉప్పల్ వైపు ప్రవేశం నిషేధించి, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మళ్లిస్తారు. వరంగల్ వైపు వెళ్లే వాహనదారులు ఓఆర్ఆర్ మార్గాన్ని వినియోగించాలని సూచించారు.హబ్సిగూడ, రామంతాపూర్ వైపులా ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. స్టేడియం లోపలికి కేవలం పాస్ ఉన్న వీవీఐపీ, వీఐపీ వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుంది.ట్రాఫిక్ సమస్యలు నివారించేందుకు ప్రేక్షకులు మెట్రో రైలు లేదా ఆర్టీసీ బస్సులను వినియోగించాలని పోలీసులు సూచించారు.

# మానవతా సేవకు నిదర్శనం..
# చలివేంద్రంతో ముందుకు సత్యసాయి సమితి

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 02 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట బస్టాండ్ ఆవరణలో శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో వేసవి వేడిమిని దృష్టిలో ఉంచుకుని చలివేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. పట్టణ ప్రజలు, బాటసారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు సమితి కన్వీనర్ గన్ను సతీష్ కుమార్ తెలిపారు.

ఈ చలివేంద్రం ద్వారా ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు సుమారు 60 రోజుల పాటు చల్లటి మినరల్ వాటర్‌ను ఉచితంగా అందించనున్నారు.

అదనంగా వారానికి రెండు రోజులు రాగి జావా, మజ్జిగ పంపిణీ కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సత్యసాయి సేవా సమితి సమాజ సేవలో ఎప్పుడూ ముందుండి ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. ముఖ్యంగా కరోనా సమయంలో అందించిన సేవలు ప్రశంసనీయమని తెలిపారు.

ఈ వేసవి కాలంలో ప్రజలు చలివేంద్రాన్ని ఉపయోగించుకుని తమ దాహార్తిని తీర్చుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ సత్యం సావిత్రి, చందా విశ్వనాథం, గన్ను ఉపేందర్, గౌరీశెట్టి సత్యనారాయణ తదితర సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.






# గ్రామస్థాయిలో సమస్యల పరిష్కారమే లక్ష్యం..!

- **అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని సూచన.**
- **ఎమ్మెల్యే జారె ఆదినారాయణ.**

**దమ్మపేట, ఏప్రిల్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో దమ్మపేట మండలంలోని పలు గ్రామపంచాయతీలలో గురువారం నిర్వహించిన గ్రామసభల్లో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడమే గ్రామసభల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇటీవల ఎన్నికైన గ్రామ పంచాయతీ ప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పారదర్శకంగా పనిచేయాలని, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు.



# సర్వాయి పాపన్నకు ఘన నివాళి

- **ట్యాంక్‌బండ్‌పై విగ్రహం ఏర్పాటు ఆలస్యం పై నేతల ఆగ్రహం**
- **బీసీలకు న్యాయం చేయాలని, పెండింగ్ ఎక్స్‌గ్రేషియా విడుదల చేయాలని డిమాండ్**

**కుషాయిగూడ, ఏప్రిల్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316వ వర్ధంతి సందర్భంగా ఈసీఐఎల్ చౌరస్తాలో మేడ్చల్ మల్కాజిగిరి గౌడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు, భక్తులు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా గౌడ జేఏసీ రాష్ట్ర కోకన్వీనర్ ముత్యం ముఖేష్ గౌడ్ మాట్లాడుతూ ట్యాంక్‌బండ్‌పై పాపన్న గౌడ్ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ చేసి నెలలు గడిచినా ప్రభుత్వం ఇప్పటికీ విగ్రహం ఏర్పాటు చేయకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్ల ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ గీత కార్మికులకు సంబంధించిన పెండింగ్ ఎక్స్‌గ్రేషియా నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. బీసీ నాయకుడు గోగికర్ శివకుమార్ మాట్లాడుతూ వెనుకబడిన తరగతులకు అన్యాయం జరిగితే సహించబోమని, అవసరమైతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.మరో నేత విద్యాసాగర్ బడ్జెట్‌లో బీసీలకు కేటాయింపులు తగినంతగా లేవని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కోశాధికారి బుడంపల్లి నిరంత్ గౌడ్, మిట్టపల్లి విజయ్ గౌడ్, తాళ్ల వెంకటేష్ గౌడ్, రత్నపురం వెంకటేశ్వర్లు, రఘుపతి గౌడ్, గణేష్, రామకృష్ణ, పాండు గౌడ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.



# 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక పామిరెడ్డి పల్లి గ్రామసభ

**పెద్దమందడి,ఏప్రిల్2(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలో గ్రామసభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం రైతు వేదికలో గ్రామ సర్పంచ్ శ్రీమతి మధిర మంజుల శ్రీశైలం అధ్యక్షతన జరిగింది .ఈ గ్రామసభలో గ్రామంలో ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనులు మరియు భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు.గ్రామంలో రైతు రుణమాఫీ కింద 315 మంది లబ్ధిదారులకు రూ.212.90 లక్షలు, రైతు భరోసా పథకం కింద 1094మంది లబ్ధిదారులకు రూ.108.90 లక్షలు అందించబడినట్లు తెలిపారు. వరి ధాన్య సేకరణలో 292 మంది రైతులకు రూ.311.35 లక్షలు చెల్లించగా, కొత్తగా 269 రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగింది. అలాగే ఉచిత విద్యుత్ పథకం కింద 430 మంది లబ్ధిదారులు ఉన్నారని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా 24 మందికి రూ.1.20 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.11.41 లక్షల వడ్డీ లేని రుణాలు అందించగా, చేయూత పెన్షన్లు 328 మందికి అందుతున్నాయని తెలిపారు. అదేవిధంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుపై కూడా చర్చించారు.గ్రామంలో ఇంకా అభివృద్ధి పనులు చేయాల్సి ఉన్నాయని, వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి ఆశీస్సులతో అభివృద్ధి శరవేగంగా కొనసాగుతోందని గ్రామ పెద్దలు తెలిపారు.ప్రస్తుతం మూడు నెలల కాలవ్యవధిలో రూ.30 లక్షల విలువైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. పామిరెడ్డిపల్లి గ్రామంపై ప్రత్యేక దృష్టి పెట్టినందుకు గ్రామ ప్రజల తరపున శాసనసభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం, ఉప సర్పంచ్ రాములమ్మ, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ సిద్దయ్య, మాజీ ఎంపీటీసీ ఇంద్ర లక్ష్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్రవంతి, ఫీల్డ్ అసిస్టెంట్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో విజయవంతంగా గ్రామ, వార్డు సభల నిర్వహణ..



- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ -02(తెలంగాణ ముచ్చట్లు):** జిల్లా వ్యాప్తంగా 571 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు, 177 మునిసిపల్ వార్డుల్లో వార్డ్ సభలు విజయవంతంగా నిర్వహించినట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 571 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించగా, పట్టణ ప్రాంతాల్లో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో 60, వైరా మున్సిపాలిటీలో 20, కల్లూరులో 20, మధిరలో 22, సత్తుపల్లిలో 23, ఏదులాపురం మున్సిపాలిటీలో 32 వార్డుల్లో సభలు సజావుగా నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సభలను రాష్ట్ర గీతంతో ప్రారంభించి, గౌరవ ముఖ్యమంత్రి వీడియో సందేశం ప్రదర్శన, వివిధ శాఖల పురోగతి వివరాలను ప్రజలకు తెలియజేయడం జరిగిందన్నారు. అలాగే, ప్రభుత్వ పథకాల క్రింద లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించడం, వారి అభిప్రాయాలను స్వీకరించడం, ప్రజా ప్రతినిధుల సందేశాలు వినిపించడం వంటి అన్ని అజెండా అంశాలను క్రమబద్ధంగా అమలు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన గ్రామ, వార్డు సభల్లో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మొత్తం 5,201 మంది ప్రజా ప్రతినిధులు, 4,585 మంది అధికారులు, 62,943 మంది ఇతరులు పాల్గొనగా, మొత్తం 72,814 మంది సభలకు హాజరైనట్లు తెలిపారు. సత్తుపల్లి నియోజక వర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి సత్తుపల్లి మున్సిపాలిటీ 2వ, 3వ వార్డుల్లో నిర్వహించిన వార్డు సభల్లో పాల్గొన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ముదిగొండ మండలం వెంకటాపురం గ్రామ పంచాయతీ లో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. గ్రామ, వార్డు సభలు ప్రజలు, ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో పారదర్శకంగా నిర్వహించబడినట్లు, ప్రజల నుండి మంచి స్పందన లభించిందని, గ్రామస్థుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే దిశగా ఈ సభలు సమర్థ వేదికగా నిలుస్తాయని అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు

## "ఒక్క క్షణం లో విషాదం...పల్టీలు కొట్టిన ఆటో, డ్రైవర్ మృతి"



**జమ్మికుంట టోన్ ఏప్రిల్ 02 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జమ్మికుంట నుంచి హుజురాబాద్ మండలం పోతిరెడ్డి పేటకు వెళ్తున్న ఆటో పెద్దంపల్లి మూలమలుపు వద్ద అదుపుతప్పి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ తేలుకుంట శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండటంతో డ్రైవర్‌కు తీవ్రమైన గాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న స్థానికులు, పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## జమ్మికుంట గణేష్ నగర్‌లో దివ్య హనుమాన్ పూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్



**జమ్మికుంట టౌన్, ఏప్రిల్ 02 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంటలోని గణేష్ నగర్ సంజీవని హనుమాన్ దేవాలయంలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ దిలీప్ మాట్లాడుతూ, పట్టణ ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాల కోసం ఈ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. హనుమాన్ జయంతి సందర్భంగా భక్తి భావంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో సాగింది. అనంతరం ఆలయ అర్చకులు, భక్తులతో కలిసి ఆయన మాట్లాడుతూ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి రాము, నేదూరి సమ్మయ్య, చరణ్, సదానందం, సమ్మయ్య సహా అనేక మంది భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చర్లపల్లి ఎంఆర్ఆర్ కాలనీలో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

- మురుగు నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం
- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**చర్లపల్లి, ఏప్రిల్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్‌లోని ఎంఆర్ఆర్ కాలనీలో డ్రైనేజీ పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. కాలనీలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న మురుగు నీటి సమస్యను పరిష్కరించేందుకు ఈ పనులను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్థానిక ప్రజల సమస్యలను ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకుంటుందని పేర్కొన్నారు. డ్రైనేజీ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడి, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని చెప్పారు. పనులు పూర్తయ్యాక కాలనీలో మురుగు నీటి సమస్య పూర్తిగా తగ్గి ప్రజలకు ఉపశమనం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ పార్టీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, కాలనీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, శివరామ్ రెడ్డి, శ్రీనివాస్, పత్తి రామ్ రెడ్డి, మల్లారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, గోపాల్ భాస్కర్ రెడ్డి తదితర పార్టీ నాయకులు మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల నల్ల బ్యాడ్జీలతో నిరసన

- పాత కార్మిక చట్టాల అమలు చేయాలని డిమాండ్




**మేడ్చల్ మల్కాజిగిరి, ఏప్రిల్ 02 (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆశా వర్కర్లు బ్లాక్ డే పాటిస్తూ నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వర్కర్లు కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రేవతి కళ్యాణి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాత కార్మిక చట్టాలను అమలు చేయాలని ఆమె కోరారు ."నాలుగు లేబర్ కోడ్ల అమలు రోజును కార్మికుల జీవితాల్లో చీకటి రోజుగా (బ్లాక్ డే)గా గుర్తిస్తాం. ప్రభుత్వం పునరాలోచించి ఈ కోడ్లను రద్దు చేసి పాత చట్టాలను అమలు చేయాలి," అని ఆమె పేర్కొన్నారు.యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. ఉన్నికృష్ణ మాట్లాడుతూ, 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా మార్చడం వల్ల కార్మికుల హక్కులు దెబ్బతింటాయని అన్నారు.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా నాచారం, మల్లాపూర్, చర్లపల్లి, కుషాయిగూడ, కీసర తదితర ప్రాంతాల్లో ఆశా వర్కర్లు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు లత, యాదమ్మ, మమత, ప్రవీణ్ తదితరులు, స్థానిక ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం: సోయం

- అధికారులు లేక గ్రామసభలపై ప్రశ్నలు.



**దమ్మపేట, ఏప్రిల్ 2 (తెలంగాణ ముచ్చట్లు-):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సోయం వీరభద్రం విమర్శించారు. అశ్వరావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలం కొమ్ముగూడెం గ్రామంలో గురువారం నిర్వహించిన 99 రోజుల ప్రజాపాలన గ్రామసభలో ఆయన మాట్లాడారు. కళ్యాణలక్ష్మి కింద తులం బంగారం, రైతు భరోసా, సంవత్సరానికి ఆరు గ్యాస్ సిలిండర్లు, గృహలక్ష్మి-మహాలక్ష్మి పథకాలు, వృద్ధాప్య-వికలాంగుల పెన్షన్ల పెంపు, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వైద్యం వంటి హామీలు అమలు కాలేదని ఆరోపించారు. మొత్తం 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని ఎద్దేవా చేశారు. గ్రామసభలకు అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడం వల్ల ప్రజలకు ప్రయోజనం లేకుండా పోతుందని, ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పే బాధ్యత అధికారులపై ఉండాలని పేర్కొన్నారు. గ్రామంలోని సమస్యలపై నోడల్ అధికారి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీసీ రోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజీ, క్రీడాస్థలాలు, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, పరిశుభ్రత కోసం ట్రాక్టర్లు, నీటి ట్యాంకులు వంటి సదుపాయాలు కల్పించారని తెలిపారు. సర్పంచ్ సోయం సత్యవతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

- జై దుర్గ భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో
- వివిధ కాలనీల భక్తుల విస్తృత పాల్గొనడం.. పులిహోర, పనకం పంపిణీ



**కుషాయిగూడ, ఏప్రిల్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ కుషాయిగూడ డివిజన్ పరిధిలో హనుమాన్ జయంతి సందర్భంగా జై దుర్గ భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మీనాక్షి నగర్, ఇందిరానగర్, లక్ష్మి నరసింహస్వామి కాలనీ, ఎంఆర్ఆర్ కాలనీ, ద్వారకాపురి కాలనీ, మధురానగర్ కాలనీలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామివారిని ఆరాధించారు.కార్యక్రమంలో ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించి హనుమంతుడి మహిమను స్మరించుకున్నారు. అనంతరం భక్తులకు పులిహోర, పనకం, రసం ప్రసాదంగా పంపిణీ చేశారు. కార్యక్రమం మొత్తం భక్తి వాతావరణంలో సాగి, ప్రాంతంలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపింది.స్థానిక యువత సేవా కార్యక్రమాల్లో ముందుండటం అభినందనీయమని పలువురు ప్రశంసించారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

- శివ సాయి నగర్ హనుమాన్ ఆలయంలో భక్తుల రద్దీ
- ప్రత్యేక పూజలు, ప్రసాదం పంపిణీ

**కుషాయిగూడ, ఏప్రిల్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ కుషాయిగూడ డివిజన్ పరిధిలోని శివ సాయి నగర్ హనుమాన్ ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.ఉదయం నుంచే భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. మహిళలు, యువకులు భక్తి శ్రద్ధలతో కార్యక్రమాలలో పాల్గొన్నారు. నిర్వహణ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు సమర్థంగా నిర్వహించగా, వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రశాంతంగా ముగిశాయి.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# హుజురాబాద్‌లో చిన్న హనుమాన్ జయంతి

**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 02 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్‌లోని ప్రసిద్ధ హనుమాన్ దేవాలయం చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా భక్తి పారవశ్యంతో కళకళలాడింది. వేకువజామున నుంచే హనుమాన్ దీక్షాపరులు "జై శ్రీరామ్" నినాదాలతో ఆలయాన్ని నింపి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు భాస్కర్ స్వామివారికి ఘనంగా అర్చనలు, అభిషేకాలు నిర్వహించగా, ఆలయం అంతటా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయగా, భక్తులు భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. హనుమాన్ దీక్ష పరుల కోసం ప్రత్యేకంగా అన్నదానం ఏర్పాటు చేసి, భక్తులకు సాత్విక భోజనం వడ్డించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారి దర్శనం చేసుకొని, ఆశీస్సులు పొందారు. మొత్తం మీద హుజురాబాద్‌లో చిన్న హనుమాన్ జయంతి వేడుకలు భక్తి, శ్రద్ధ, వైభవాలతో సాగాయి.

# కాప్రా మజిద్‌లో సీసీ కెమెరాల ప్రారంభం

- భద్రతా వ్యవస్థ బలోపేతానికి సీసీ కెమెరాలు కీలకం
- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**కాప్రా, ఏప్రిల్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గ కాప్రా సర్కిల్ పరిధిలో కాప్రా మజిద్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాంతంలో భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.ప్రజల భద్రత కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. అలాగే శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాల నెట్‌వర్క్ ఎంతో ఉపయోగకరమని, స్థానిక ప్రజల సహకారంతో మరింత సురక్షిత వాతావరణం ఏర్పాటు చేయవచ్చని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో కుషాయిగూడ సీఐ భాస్కర్ రెడ్డి, మైనార్టీ నాయకులు బద్రుద్దిన్, తాజుద్దీన్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# "5 లక్షలు సరిపోవు... 7 లక్షలకు పెంచాలని గళమెత్తిన బీసీ నేతలు"



**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 02 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారులకు అందిస్తున్న రూ.5 లక్షల ఆర్థిక సహాయం సరిపోవడం లేదని, దాన్ని రూ.7 లక్షలకు పెంచాలని బీసీ ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం అందిస్తున్న సహాయం గొప్ప వరమని పేర్కొన్న ఆయన, ప్రస్తుత మార్కెట్‌లో నిర్మాణ సామగ్రి ధరలు విపరీతంగా పెరగడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం ఇళ్లు నిర్మించడానికి ఖర్చులు అధికమవడంతో, చాలా మంది అప్పులపాలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పేదల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని రూ.7 లక్షలకు పెంచాలని ఆయన కోరారు. అలాగే మొదటి విడతలో ఎంపికైన లబ్ధిదారుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకమారి శ్రీనివాస్, హుజురాబాద్ మండల అధ్యక్షుడు నడిగోటి రమేష్, ప్రధాన కార్యదర్శి మమునూరి ప్రవీణ్, ఉపాధ్యక్షుడు కొల్లిపాక క్రాంతి కుమార్, ప్రచార కార్యదర్శి పంజాల వెంకటేశ్వర్లు గౌడ్, కందుకూరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాకాల రాజ్ కుమార్ నియామకం

- మేడ్చల్ మల్కాజిగిరి డీసీసీ నూతన కార్యవర్గం
- ప్రకటించిన కాంగ్రెస్ అధిష్ఠానం
- పార్టీ శ్రేణుల్లో హర్షం



**కాప్రా, ఏప్రిల్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన కార్యవర్గాన్ని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అధికారికంగా ప్రకటించింది. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ చేసిన సంప్రదింపుల ఆధారంగా వైస్ ప్రెసిడెంట్లు, ప్రధాన కార్యదర్శులు, ట్రెజరర్, ప్రతినిధులు మరియు కార్యవర్గ సభ్యుల నియామకాలకు ఆమోదం లభించింది.ఈ నియామకాలు తక్షణమే అమలులోకి వస్తాయని పార్టీ వర్గాలు తెలిపాయి.ఈ నేపథ్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాకాల రాజ్ కుమార్ నియమితులయ్యారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, సంస్థ బలోపేతానికి కృషి చేస్తున్న ఆయన సేవలను గుర్తించి ఈ బాధ్యత అప్పగించినట్లు సమాచారం. రాజ్ కుమార్ నియామకంపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. ఆయన భవిష్యత్తులో మరింత బాధ్యతాయుతంగా పనిచేసి పార్టీ అభివృద్ధికి తోడ్పడతారని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా శ్రేయోభిలాషులు, కార్యకర్తలు ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

# నారాయణ పాఠశాలలో ఘనంగా స్నాతకోత్సవం

- విద్యార్థులకు పట్టాలు ప్రదానం
- భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు



**తార్నాక, ఏప్రిల్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** తార్నాకలోని నారాయణ పాఠశాలలో స్నాతకోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జీఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం బాలపరమేశ్వరావు హాజరై విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, విద్యార్థులు ఒక దశ నుంచి మరొక దశకు అడుగుపెడుతున్న ఈ సందర్భం ఎంతో కీలకమని తెలిపారు. కేజీ నుంచి ప్రాథమిక విద్యకు, అలాగే ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత తరగతులకు వెళ్లే ఈ మార్గంలో స్నాతకోత్సవం ఒక ముఖ్య ఘట్టమని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాలను సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపాల్ పర్వీన్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటూ మరెన్నో విజయాలు సాధించాలని సూచించారు. తమ ప్రతిభతో సమాజంలో మంచి స్థానం సంపాదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ నారాయణ పాఠశాలల పదవ తరగతి ఇంచార్జ్ ముంతాజ్, ఆర్ & డి సభ్యులు మనోహర్, మహేశ్వరి, మీనా, కోఆర్డినేటర్లు ఆజాద్, లక్ష్మీభవాని, నూర్, ఏడి సురేష్, వి.పీ సరిత, షాహీన్, ఏఓ మహేందర్, పీఈటీ నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సిర్సపల్లి పల్లె దవాఖానాపై ఆకస్మిక తనిఖీ... సేవల్లో మెరుగుదలకు సూచనలు



**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 02 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ మండలం సిర్సపల్లి గ్రామంలోని పల్లె దవాఖానాను డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రవణ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానా పనితీరు, సిబ్బంది హాజరు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. సిబ్బంది సమయపాలనకు కట్టుబడి పనిచేయాలని ఆయన ఆదేశించారు. రోగులకు అవసరమైన బీపీ, షుగర్ మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని, రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. ప్రస్తుత వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని డిహైడ్రేషన్ కేసులు పెరిగే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గ్రామస్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకునేలా చైతన్యం చేయాలని అధికారులను ఆదేశించారు.

# వనపర్తి జిల్లాలో ఘనంగా అత్యవసర వైద్య సాంకేతిక నిపుణుల దినోత్సవ వేడుకలు




**వనపర్తి,ఏప్రిల్2(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లాలో అత్యవసర వైద్య సాంకేతిక నిపుణుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం 108 అంబులెన్స్ సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా కార్యక్రమ నిర్వహణాధికారి రవి, జిల్లా సమన్వయకర్త రత్నమయ్యతో పాటు వైద్య సాంకేతిక నిపుణులు, వాహన నడిపేవారు మరియు ఇతర సిబ్బంది పాల్గొని తమ సేవల ప్రాముఖ్యతను వివరించారు.ఈ సందర్భంగా 108 అంబులెన్స్ సేవల ప్రాధాన్యతను తెలియజేస్తూ, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు ఇవి ప్రాణాధారంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. రోజుకు ఇరవై నాలుగు గంటలు ఉచితంగా అందుబాటులో ఉండే ఈ సేవలు పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ సమానంగా అందుతున్నాయని తెలిపారు. ప్రమాదాలు, గుండె సంబంధిత సమస్యలు, పక్షవాతం, గర్భిణీ స్త్రీల అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించి ప్రాణాలను కాపాడుతున్నాయని వెల్లడించారు.అత్యవసర వైద్య సాంకేతిక నిపుణులు సంఘటనా స్థలంలోనే ప్రాథమిక చికిత్స అందించి, అత్యంత కీలకమైన సమయమైన గోల్డెన్ అవర్‌లో రోగులను స్థిరపరిచి ఆసుపత్రికి తరలించడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారని వివరించారు.గత ఒకే సంవత్సరంలో జిల్లాలో 14,209 అత్యవసర కేసులకు 108 అంబులెన్స్ సేవలు అందించాయని అధికారులు తెలిపారు.ప్రమాద బాధితులు, గర్భిణీలు, గుండె మరియు పక్షవాతం బాధితులకు సమయానుకూల వైద్య సహాయం అందించడంతో వేలాది మంది ప్రాణాలు రక్షించబడ్డాయని చెప్పారు.ఈ గణాంకాలు ప్రజల్లో ఈ సేవలపై ఉన్న విశ్వాసాన్ని స్పష్టంగా చూపుతున్నాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఒక వైద్య సాంకేతిక నిపుణుడు మాట్లాడుతూ, ప్రతి రోజూ అత్యవసర కాల్స్‌కు తక్షణమే స్పందించి కొద్ది నిమిషాల్లో సంఘటనా స్థలానికి చేరుకుంటామని తెలిపారు.గోల్డెన్ అవర్‌లో అందించే చికిత్స వల్ల అనేక ప్రాణాలను కాపాడగలుగుతున్నామని, ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో ఆలస్యం చేయకుండా వెంటనే 108కు సమాచారం ఇవ్వాలని కోరారు.కార్యక్రమ నిర్వహణాధికారి రవి మాట్లాడుతూ.. మహబూబ్నగర్ జిల్లాలో 108 సేవలు ప్రజలకు అత్యంత అవసరమైన సమయంలో ప్రాణాధారంగా నిలుస్తున్నాయని తెలిపారు.వైద్య సాంకేతిక నిపుణులు అంకితభావంతో పనిచేస్తూ ప్రతి కాల్‌ను అత్యవసరంగా తీసుకుని స్పందిస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మానవతా సేవలకు ప్రతీకగా నిలుస్తున్న ఈ సేవల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవం చూపాలని అధికారులు కోరారు.

# సూర్యకిరణాలతో స్వామివారి పాదాల దివ్య దర్శనం



- గిరిప్రదక్షిణ మహోత్సవంలో భక్తుల భక్తి పారవశ్యం
- ఘనంగా నిర్వహణ

**కీసర, ఏప్రిల్ 02 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని హేమాద్రి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో చైత్ర పౌర్ణమి మరియు శ్రీ హనుమత్ విజయోత్సవం సందర్భంగా గిరిప్రదక్షిణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రతి పౌర్ణమి నాడు నిర్వహించే ఈ కార్యక్రమానికి ఈసారి భారీ సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.ఉదయం పవిత్ర వేళలో స్వామివారి పాదాలను సూర్య కిరణాలు తాకిన అరుదైన దృశ్యం భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తింది. ఈ దివ్య దర్శనం కోసం భక్తులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసి, దర్శించుకుని పరవశించారు.మేళతాళాల మధ్య భక్తులు గిరిప్రదక్షిణ చేస్తూ భజనలు, గీతాలాపనలు నిర్వహించారు. ఆలయ పరిసరాలు భక్తిరసంతో మార్మోగాయి.తదుపరి శ్రీ వీరాంజనేయ స్వామి వారికి విశేష అభిషేకం నిర్వహించి పుష్పాలు, ఫలాలతో నైవేద్యాలు సమర్పించారు. వేదపండితులు వేద ఆశీర్వచనాలు అందజేశారు.కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి లాకెట్లు ప్రసాదంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కందాడి హనుమంత్ మాట్లాడుతూ, గిరిప్రదక్షిణ మహోత్సవం భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించే కార్యక్రమమని తెలిపారు. భక్తుల సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు .ఈ మహోత్సవంలో స్థానిక భక్తులు, గ్రామ ప్రజలు, దేవస్థానం నిర్వాహకులు, సేవా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వేలేరు గ్రామసభలో అభివృద్ధి పథకాలపై చర్చ



**వేలేరు, ఏప్రిల్ 02 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ మీ యాదగిరి గారి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామసభ స్పెషల్ ఆఫీసర్ మరియు మండల తహసీల్దార్ శ్రీమతి కోమీ గారు, మండల స్పెషల్ ఆఫీసర్ రవీందర్ సింగ్ గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్టాత్మక పథకాలైన ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి, కల్యాణలక్ష్మి, వడ్డీ లేని రుణాలు, కొత్త రేషన్ కార్డులపై చర్చించారు. అదేవిధంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్యల సహకారంతో గ్రామానికి మంజూరైన నిధులు, పూర్తయిన అభివృద్ధి పనులపై వివరించారు. భవిష్యత్తులో గ్రామ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. గ్రామసభలో సుమారు 680 మంది గ్రామ ప్రజలు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకర్, విద్యుత్ శాఖ ఏఈ కుమారస్వామి, హెల్త్ డిపార్ట్మెంట్ నవీన్, జీపీ కార్యదర్శి సంపత్ కుమార్, ఎస్బీఐ శాఖ మేనేజర్ కుమారస్వామి, వివిధ శాఖల అధికారులు మరియు వార్డు సభ్యులు సంధ్య, ప్రవళిక, మౌనిక, పర్వీన్, రణధీర్ రెడ్డి, జావిద్ పాషా, లక్ష్మీనారాయణ, ప్రశాంత్, సురేష్, సునీల్ పాల్గొన్నారు.

# వేలేరు గ్రామసభలో ప్రభుత్వ పథకాల ప్రగతిపై సమీక్ష



**వేలేరు, ఏప్రిల్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం భాగంగా గ్రామసభ నిర్వహించబడింది. ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్ బిల్లా యాదగిరి అధ్యక్షత వహించారు. గ్రామసభ స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న మండల తహసీల్దార్ కోమీ, మండల స్పెషల్ ఆఫీసర్ రవీందర్ సింగ్ పాల్గొన్నారు. సమావేశంలో ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాల అమలు, ప్రగతి అంశాలపై చర్చ జరిగింది. ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి, కల్యాణలక్ష్మి, వడ్డీ లేని రుణాలు, కొత్త రేషన్ కార్డులు వంటి పథకాలపై వివరాలు తెలియజేశారు. గ్రామానికి మంజూరైన నిధులు, ఇప్పటికే పూర్తయిన అభివృద్ధి పనులు, ఇంకా చేయాల్సిన పనులపై సమగ్రంగా సమీక్షించారు. భవిష్యత్తులో గ్రామ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

ప్రజల అభిప్రాయాలను స్వీకరించేందుకు గ్రామసభలో విస్తృత చర్చ జరిగింది. దాదాపు 650 మంది గ్రామస్తులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సమావేశం విజయవంతం కావడానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకర్, విద్యుత్ శాఖ అధికారి కుమారస్వామి, ఆరోగ్య శాఖ ప్రతినిధి నవీన్, గ్రామపంచాయతీ కార్యదర్శి సంపత్ కుమార్, మండల సమైక్య సీసీ, అలాగే విద్య, గృహ నిర్మాణ, వ్యవసాయ, ఉపాధి హామీ, పంచాయతీ రాజ్ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. వార్డు సభ్యులు సంధ్య, ప్రవళిక, మౌనిక, పర్వీన్, రణధీర్ రెడ్డి, జావిద్ పాషా, లక్ష్మీనారాయణ, ప్రశాంత్, సురేష్, సునీల్ తదితరులు హాజరయ్యారు.

# హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులకు అరటిపండ్ల పంపిణీ



- **కీసరలో సేవా కార్యక్రమాలు...**
- **తుడుం శ్రీనివాస్ సేవాభావానికి ప్రశంసలు**

**కీసర, ఏప్రిల్ 02 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమాన్ జయంతి సందర్భంగా కీసర మండలంలో భక్తి, సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. కీసర హనుమాన్ ఆలయంలో భక్తుల రద్దీ నెలకొనగా, ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో కళకళలాడింది.ఈ సందర్భంగా సామాజిక సేవా కార్యకర్త, గ్రామ పంచాయతీ మాజీ వార్డు సభ్యుడు తుడుం శ్రీనివాస్ భక్తులకు అరటిపండ్లు పంపిణీ చేసి సేవా భావాన్ని చాటుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలు అందజేశారు. భక్తులకు సేవ చేయడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు తుడుం శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ప్రెసిడెంట్ గోరంటి ప్రవీణ్, యువ నాయకులు నాయకపు శ్రీకాంత్ ముదిరాజ్, మొరుగు ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గ్రామసభలతో ప్రజలకు చేరువవుతున్న సంక్షేమం

- **వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**




**వనపర్తి,ఏప్రిల్2(తెలంగాణ ముచ్చట్లు):** ప్రజలకు సంక్షేమ ఫలాలు సమర్ధవంతంగా అందించేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నామని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి తెలిపారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ గొప్ప కార్యక్రమమని, ఒకే రోజు జిల్లాలోని 268 గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. గురువారం ఏదుల మండలం కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన గ్రామసభకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు తెలంగాణ గీతాలాపన చేసి, గ్రామ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను అధికారులు చదివి వినిపించారు.గ్రామంలో అమలు చేస్తున్న వివిధ పథకాల లబ్ధిదారుల వివరాలు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పెన్షన్లు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఉపాధి హామీ పథకం పనులు వంటి అంశాలను వివరించారు.గ్రామ ప్రజల సమస్యలు, కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల బాధ్యతలపై కూడా చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామసభల ముఖ్య ఉద్దేశం గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేయడంతో పాటు, ఇంకా అవసరమైన సంక్షేమ కార్యక్రమాలను గుర్తించడం అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, మహిళా సంక్షేమ పథకాలు వంటి కార్యక్రమాలతో ప్రజల మన్ననలు పొందుతోందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం, రైతులకు భారీ స్థాయిలో రుణమాఫీ చేయడం వంటి చర్యలు చారిత్రాత్మకమని పేర్కొన్నారు.ఏదుల గ్రామంలో 303 మంది రైతులకు రూ. 2.77 కోట్ల రుణమాఫీ, 1351 రేషన్ కార్డుల్లో కొత్తగా 192 కార్డుల మంజూరు, 489 మందికి ఉచిత విద్యుత్, 36 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఉచిత చీరల పంపిణీ వంటి కార్యక్రమాలు కూడా అమలు చేస్తున్నట్లు చెప్పారు.మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.తాగునీటి సమస్య పరిష్కారం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు వంటి అంశాలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.జిల్లా వ్యాప్తంగా రైతులకు రూ. 480 కోట్ల రుణమాఫీ, లక్షలాది రైతులకు రైతు భరోసా అందించామని తెలిపారు. త్వరలో విద్యార్థుల కోసం ఉదయం ఆహార పథకం అమలు చేయనున్నట్లు కూడా వెల్లడించారు.ఇంకా సంక్షేమ పథకాల లబ్ధి పొందని వారు గ్రామసభలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

# దమ్మపేటలో గ్యాస్ ధరల పెంపుపై సిఐటియు ఆందోళన.!

- **కమర్షియల్ సిలిండర్ల ధరలు తగ్గించాలని డిమాండ్.**




**దమ్మపేట, ఏప్రిల్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ సిలిండర్లపై పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 14 కేజీల గ్యాస్ సిలిండర్ ధరలు పెంచి 20 రోజులు కూడా కాకముందే మళ్లీ కమర్షియల్ గ్యాస్ ధరలు పెంచడం వల్ల ప్రజలపై మోయలేని భారం పడుతోందని విమర్శించారు. కమర్షియల్ గ్యాస్ ధరల పెరుగుదలతో చిన్న వ్యాపారులు, టీ దుకాణాలు, టిఫిన్ సెంటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు.

ప్రభుత్వం గ్యాస్ కొరత లేదని చెబుతున్నప్పటికీ, వాస్తవంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సిఐటియు మండల కన్వీనర్ మురహరి రఘు మాట్లాడుతూ, ఆటోలకు వినియోగించే ఎల్పీజీ గ్యాస్ ధరలు పెరగడంతో ఆటో కార్మికులు తీవ్రంగా ప్రభావితమవుతున్నారని, రవాణా రంగంపై కూడా దాని ప్రభావం పడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు కోడూరి కృష్ణ, రామకృష్ణ, కర్రాజులు రాము, రాంప్రసాద్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్ధవంతంగా అమలు

- **ఆదర్శ గ్రామంగా నాగారం నిలవాలి.**
- **బాల్య వివాహాలను నిర్మూలించాలి.**
- **బాలికలను ఉన్నత విద్యవైపు ప్రోత్సహించాలి.**
- **హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి.**




**హసన్ పర్తి,ఏప్రిల్ 02(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలతో పాటు గ్రామస్తుల సహకారంతో నాగారం ఆదర్శంగా నిలవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.

గురువారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం నాగారం గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామ సభ ను గ్రామ సర్పంచ్ సందరాజు లావణ్య అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర గీతాన్ని ఆలపించి ,ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ దేశంలో మరెక్కడా లేనివిధంగా రాష్ట్రం లో అనేక అభివృద్ధి,సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు,గృహజ్యోతి ,చేయూత పింఛన్లు తదితర ఎన్నో పథకాలు అమలవుతున్నాయని ఇందిరమ్మ ఇండ్ల విషయానికొస్తే ఒక్కో గ్రామానికి దాదాపుగా 35పైగా ఇండ్లు మంజూరై ఉన్నాయన్నారు. ఒక్క నాగారం గ్రామంలోనే 800 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని,గృహ జ్యోతి పథకం కింద 63 లక్షల రూపాయలు వినియోగదారులకు ఉచిత విద్యుత్ ప్రయోజనం కలిగిందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఎల్ త్రీ లో ఉన్న వారికి తదుపరి ఇచ్చే ఇండ్లు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంచి అవకాశాన్ని కల్పించిందని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం కావాలన్నారు. గ్రామంలో ఉన్న ప్రతి ప్రభుత్వ కార్యాలయం,ఆరోగ్య కేంద్రం,పాఠశాల,అంగన్వాడీ కేంద్రాలలో ఏవైనా చిన్న చిన్న సమస్యలు ఉన్నట్లయితే సర్పంచ్ బాధ్యత తీసుకుని పరిష్కరించాలని సూచించారు. మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలు అంటే మహిళా శక్తికి నిదర్శనమని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రతి నెల సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. గతంలో ఏవైనా రుణాలు తీసుకోవాలంటే ఇబ్బందులు ఉండేవని,కానీ ప్రస్తుతం మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణాలు ఇస్తామని బ్యాంకర్లు ముందుకు వస్తున్నారని తెలిపారు. మహిళలు తీసుకున్న రుణాలను వంద శాతం తిరిగి చెల్లిస్తారనే నమ్మకం బ్యాంకర్లలో ఉందని పేర్కొన్నారు.మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు సమావేశాలు నిర్వహించినప్పుడు సంఘాలకు సంబంధించిన రుణాలు తీసుకోవడం చెల్లించడం లాంటివి చర్చించడంతోపాటు గ్రామానికి సంబంధించిన అంశాలను కూడా చర్చించాలని అన్నారు. ఆదర్శ గ్రామం అంటే మంచి రోడ్లు,డ్రైనేజీ వ్యవస్థ,స్ట్రీట్ లైట్స్ మాత్రమే కాదని ఒక్కరూ కూడా పోషణ లోపం లేని పిల్లలు, క్షయ వ్యాధి లేకుండా,రక్త హీనతతో గర్భిణీలు లేకుండా ఆదర్శ గ్రామంలో ఉండాలన్నారు.18 సంవత్సరాలు నిండకుండా ఏ అమ్మాయి పెళ్లి గ్రామంలో జరగకుండా చూసుకోవాలని బాల బాలికలు డిగ్రీ వరకు చదివే విధంగా ప్రోత్సహించి పిల్లల ఇష్ట ప్రకారం ఎక్కడి వరకు చదువుకోవాలనుకుంటే అక్కడి వరకు చదివించాలని సూచించారు. నాగారం గ్రామం కూడా ఆదర్శంగా ఉండే విధంగా తీర్చిదిద్దుదామన్నారు. గ్రామస్తుల సమష్టి సహకారంతోనే ఆదర్శ గ్రామం సాధ్యమని పేర్కొన్నారు. గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, ఇతర పథకాల గురించి గ్రామానికి చెందిన తోట ప్రవీణ్ ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పేదలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలతో ఎంతో మేలు కలుగుతుందని పేర్కొన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ,విద్యుత్, ఇతర శాఖల అధికారులు గ్రామ అభివృద్ధికి సంబంధించి వివరాలను వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య,జిల్లా హౌసింగ్ పీడీ సిద్దార్థ నాయక్,జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ,జడ్పీ డిప్యూటీ సీఈవో రవి,తహసీల్దార్ కిరణ్ కుమార్, ఎంపీడీవో సుమన వాణి,విద్యుత్ శాఖ డీఈ అశోక్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం కీలకం

**బేతుపల్లిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై గ్రామసభ.**

**సత్తుపల్లి, ఏప్రిల్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** గ్రామాభివృద్ధి సాధనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని బేతుపల్లి గ్రామ సర్పంచ్ దొడ్డా రాజేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన అధ్యక్షతన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, హెచ్ఈఓ అజ్మీర వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ చిట్టిమాది చెన్నకేశవులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి కె. వెంకట జోగారావు, జీపీఓ నాగేశ్వరావు, వెటర్నరీ వైద్యురాలు సారిక, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వివో ఐకేపీ సిబ్బంది, పాఠశాల హెచ్ఎం శాంత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలైన రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, సన్నరకం వడ్లకు బోనస్, గృహ జ్యోతి, కళ్యాణలక్ష్మి/షాదీ ముబారక్, కొత్త రేషన్ కార్డులపై వివరించారు. ఇప్పటివరకు గ్రామంలో ఈ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలను కూడా ప్రజలకు తెలియజేశారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టనున్న కొత్త పథకాలైన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా, ఇంటర్మీడియట్ వరకు అల్పాహారమధ్యాహ్న భోజన పథకం, దివ్యాంగ విద్యార్థులకు మోటరైజ్డ్ వాహనాల పంపిణీ వంటి అంశాలను వివరించారు. ఈ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 18 ఏళ్లలోపు బాలికల వివాహాలు జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామసభలో పాల్గొన్న ప్రజలు కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



శుక్రవారం - 03 - ఏప్రిల్ 2026

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

## శ్రీ సాయి రేడియేటర్ వద్ద చలివేంద్రం ప్రారంభం



**కుషాయిగూడ, ఏప్రిల్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించే లక్ష్యంతో కుషాయిగూడ పోచమ్మ గుడి ఎదురుగా ఉన్న శ్రీ సాయి రేడియేటర్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు తాగునీరు అందించడం అత్యంత అవసరమని తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు ప్రజలకు ఉపశమనం కలిగించడమే కాకుండా సమాజ సేవకు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో శ్రీ సాయి రేడియేటర్ ప్రొప్రైటర్ దోమ శ్రీనివాస్ రెడ్డి, కట్కూరి విజయ్ కుమార్ రెడ్డి, ధర్మారెడ్డి, వెంకట్ రెడ్డి, నరసింహారెడ్డి, శివారెడ్డి, అర్జున్, నాని, నరేష్, తేజ, రామ్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెరుపు వేగంతో కేసు ఛేదించిన ఎల్కతుర్తి పోలీసులు

**ఎల్కతుర్తి, ఏప్రిల్ 02 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి గ్రామంలో ఇటీవల జరిగిన దొంగతనం కేసును పోలీసులు మెరుపు వేగంతో ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ ఘటనతో గ్రామ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. గ్రామంలో కొంతకాలంగా పెరుగుతున్న దొంగతనాల నేపథ్యంలో ఈ అరెస్ట్ ప్రజల్లో నమ్మకాన్ని పెంచింది.

మార్చి 31న ఎల్కతుర్తి గ్రామానికి చెందిన నరిగే సంధ్య భర్త రవి, వృత్తి కూలి, వారి ఇంట్లో దొంగలు తాళం పగలగొట్టి లోనికి చొరబడి నగదు, బంగారం, వెండి ఆభరణాలను ఎత్తుకుపోయారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ ప్రవీణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

దర్యాప్తులో భాగంగా గురువారం ఎల్కతుర్తి శివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా పారిపోవడానికి ప్రయత్నించగా పోలీసులు అతడిని పట్టుకున్నారు. విచారణలో అతని పేరు వలపదాసు ప్రవీణ్ తండ్రి చంద్రమౌళి పత్తిపాక గ్రామం, శాయంపేట మండలం అని గుర్తించారు.

నిందితుడు ఎల్కతుర్తిలో జరిగిన దొంగతనాన్ని తానే చేసినట్లు ఒప్పుకున్నాడు. అతని వద్ద నుంచి సుమారు 9 గ్రాముల బంగారం, 210 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.20,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన మొత్తం ఆస్తి విలువ సుమారు రూ.95,000గా అంచనా వేశారు.

నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన ఎస్ఐ ప్రవీణ్ కుమార్, కానిస్టేబుల్లు భాస్కర్, బక్కయ్య, రంజిత్, సుమన్, హోంగార్డులు భాస్కర్, శ్రీనివాస్‌లను సీఐ పులి రమేష్ అభినందించారు.

ఇటీవల గ్రామంలో రాత్రివేళల్లో అనుమానాస్పద వ్యక్తుల సంచారం పెరిగిందని, దీనిపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. గ్రామ ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు



కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.

పోలీసుల మెరుపు వేగంతో చర్యలతో దొంగను పట్టుకోవడంతో గ్రామ ప్రజలు పోలీసులను ప్రశంసిస్తూ ఆనందం వ్యక్తం చేశారు

## 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక వెల్టూర్ గ్రామసభ

**పెద్దమందడి,ఏప్రిల్2(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో గ్రామసభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ అశోక్ అధ్యక్షతన జరిగింది.ఈ గ్రామసభలో గ్రామంలో ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనులు మరియు భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామంలో రైతు రుణమాఫీ కింద 456 మంది లబ్ధిదారులకు రూ.346.18 లక్షలు, రైతు భరోసా పథకం కింద 1300 మంది లబ్ధిదారులకు రూ.131.06 లక్షలు అందించబడినట్లు తెలిపారు. వరి ధాన్య సేకరణలో 211 మంది రైతులకు రూ.205.13 లక్షలు చెల్లించగా, కొత్తగా 1385 రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగింది.అలాగే ఉచిత విద్యుత్ పథకం కింద 545 మంది లబ్ధిదారులు ఉన్నారని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా 34 మందికి రూ.1.70కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.24.80లక్షల వడ్డీ లేని రుణాలు అందించగా, చేయూత పెన్షన్లు 555 మందికి అందుతున్నాయని తెలిపారు. అదేవిధంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుపై కూడా చర్చించారు.గ్రామంలో ఇంకా అభివృద్ధి పనులు చేయాల్సి ఉన్నాయని, గ్రామ పెద్దలు తెలిపారు.ప్రస్తుతం మూడు నెలల కాలవ్యవధిలో లక్షల విలువైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రఘుపతి రెడ్డి, గ్రామ సర్పంచ్ అశోక్ ,ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, మహిళా సమాఖ్య సిబ్బంది, గ్రామ నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు మహిళలు, అధికారులు పాల్గొన్నారు.

## మేడ్చల్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి

- అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ చేత నివాళులు
- నేడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు




**మేడ్చల్, ఏప్రిల్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ అనుమతితో మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అంతాయపల్లి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం మీటింగ్ హాల్‌లో గురువారం ఉదయం ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీ) ఫైజాన్ అహ్మద్, ఐఏఎస్ జ్యోతి ప్రజ్వలన చేసి, పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పాపన్న గౌడ్ సమాజ ఉన్నతి కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి (ఎఫ్ ఏ సి) ఆర్.ఎస్. చంద్రావతి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి టి. ఝాన్సీ రాణి పాల్గొని, పాపన్న గౌడ్ జీవిత విశేషాలను స్మరించారు. అధికారులు, సిబ్బంది కూడా పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, ఏప్రిల్ 3న ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## పీచర సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహణ

**వేలేరు ఏప్రిల్ 02 (తెలంగాణ ముచ్చట్లు ):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పీచర గ్రామంలో గ్రామసభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం మండల ఎంపిడిఓ లక్ష్మీ ప్రసన్న గారి ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ మరిజే అనిత నరసింహారావు అధ్యక్షతన సభను ప్రారంభించారు.

గ్రామ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లు, ఆసరా పెన్షన్లు, రైతు భరోసా, ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ వంటి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామ ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం కోరారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి తోట అనిల్, వార్డు సభ్యులు,వైద్య సిబ్బంది,అంగన్ వాడి టీచర్స్, గ్రామ అధికారులు,మహిళా సంఘాలు,గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికకు జమ్మికుంటలో మంచి స్పందన

**జమ్మికుంట టౌన్, ఏప్రిల్ 02 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపాలిటీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వార్డు సభలు ప్రజల భాగస్వామ్యంతో ఘనంగా సాగాయి. మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) ఆధ్వర్యంలో 23, 24, 12వ వార్డుల్లో నిర్వహించిన సభల్లో ముఖ్యమంత్రి సందేశాన్ని ప్రజలకు వినిపించారు. అనంతరం "జయ జయహే తెలంగాణ" రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందిరమ్మ ఇళ్ల, డబుల్ బెడ్ రూమ్ పథకాలు, గృహజ్యోతి, చేయూత పెన్షన్లు, మహాలక్ష్మి పథకం కింద గ్యాస్ సబ్సిడీ వంటి అంశాలపై వివరాలు వెల్లడించారు. అలాగే తడి-పొడి చెత్త వేరు చేయడం, ప్లాస్టిక్ నిర్మూలన, పరిశుభ్రత వంటి అంశాలపై ప్రజలను చైతన్యపరిచారు. ఇంటి పన్ను, నల్లా పన్ను, ట్రేడ్ లైసెన్సులు సమయానికి చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మొలుగు ప్రణీత, చుంచు రమాదేవి, శానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్, వార్డు సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఇక 18వ వార్డులో జరిగిన సమావేశంలో డ్రైనేజీ, సీసీ రోడ్లు, పెన్షన్లు, డబుల్ బెడ్ రూమ్, ఇందిరమ్మ ఇళ్ల సమస్యలపై చర్చ జరిగింది. కౌన్సిలర్ కూతాటి తిరుపతి మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అయితే 9వ వార్డులో సభ నిర్వహణపై వివాదం నెలకొంది. కౌన్సిలర్ ఇంట్లో సభ నిర్వహించడంపై యూత్ కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వ భవనాల్లోనే సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మొత్తంగా ఈ వార్డు సభలు ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడమే కాకుండా, వారి సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లే వేదికగా నిలుస్తున్నాయి. ప్రజాపాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడంలో ఈ కార్యక్రమాలు కీలకంగా మారాయి.

## ప్రజా పాలనలో భాగంగా వార్డు సభలు

- సంక్షేమ పథకాలపై విస్తృత అవగాహన
- ప్రతి అర్హ కుటుంబానికి పథకాలు చేరేలా చర్యలు
- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



**మేడ్చల్–మల్కాజిగిరి, ఏప్రిల్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త పథకాలను ప్రవేశపెడుతూ ఆర్థికంగా బలపరిచే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రజా పాలన-ప్రజా ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం ఆలియాబాద్, ఎల్లంపేట మున్సిపాలిటీల్లో నిర్వహించిన వార్డు సభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు శిరీష రెడ్డి, శ్రీదేవి పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రైతు భరోసా, మహాలక్ష్మి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాల ద్వారా ఇప్పటికే లక్షలాది మంది లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఇక జూన్ 2 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం, వారంలో మూడు రోజులపాటు గ్లాస్ పాలు, మరో మూడు రోజులు రాగి జావా, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, దివ్యాంగ విద్యార్థులకు మోటరైజ్డ్ వాహనాల పంపిణీ వంటి కొత్త పథకాలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు.గ్రామ, వార్డు సభల ద్వారా ప్రజల సమస్యలను గుర్తించి వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పథకాల గురించి తెలియని వారికి అవగాహన కల్పించడం ప్రతి లబ్ధిదారుడి బాధ్యత అని సూచించారు.దేశంలో తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో మాత్రమే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమలులో ఉందని పేర్కొంటూ, మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.కార్యక్రమంలో ముఖ్యమంత్రి సందేశం వినిపించడం, అభివృద్ధి కార్యక్రమాల వీడియో ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రజలు తమ సమస్యలను వివరించగా, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు, వైస్ చైర్మన్లు, తహసీల్దార్లు, నోడల్ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



## సురేష్ అఖిల వివాహ మహోత్సవానికి హాజరైన మాజీ ఉప ముఖ్యమంత్రి, మాజీ మంత్రి

**పెద్దమందడి,ఏప్రిల్2(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం దొడగుంటపల్లిలో బిఆర్ఎస్ యువనాయకులు పానుగంటి సురేష్, అఖిల వివాహ మహోత్సవం ఘనంగా నిర్వహించబడింది.ఈ సందర్భంగా వివాహ వేడుకకు మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరై నూతన దంపతులకు అక్షింతలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు నూతన దంపతులు సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. కుటుంబ విలువలు, పరస్పర గౌరవం, ప్రేమతో జీవితాన్ని ముందుకు నడిపించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు, స్థానిక నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వెల్టూర్ దర్గా దర్శనానికి దారి కల్పించాలని గ్రామసభలో వినతి

- ముస్లిం స్మశాన వాటిక కోసం స్థలం కేటాయించాలి
- ఖజా హుస్సేన్ వెల్టూర్ గ్రామస్తుడు

**పెద్దమందడి,ఏప్రిల్2(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో దర్గా దర్శనానికి సరైన దారి కల్పించాలని గ్రామసభలో గ్రామస్తుడు ఖాజా హుస్సేన్ వినతి పత్రం సమర్పించారు.వెల్టూర్ గ్రామంలోని పెద్ద బావి సమీపంలో ఉన్న దర్గా వద్ద భక్తులు దర్శనం చేసుకోవడానికి సరైన మార్గం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.వెల్టూర్ గ్రామంతో పాటు ఇతర గ్రామాల నుండి కూడా భక్తులు మొక్కులు చెల్లించడానికి వస్తుంటారని, దారి సౌకర్యం లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు దర్గా చేరుకునే సమయంలో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు సమీప రైతులతో మాట్లాడి దర్గా వరకు దారి ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజల తరపున గ్రామసభలో అధికారులకు విజ్ఞప్తి చేశారు.అలాగే వెల్టూర్ గ్రామంలో సుమారు 50 ముస్లిం కుటుంబాలు నివసిస్తున్నప్పటికీ ఇప్పటివరకు వారికి స్మశాన వాటిక ఏర్పాటు కాలేదని తెలిపారు. పేద ముస్లిం కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని స్మశాన వాటిక కోసం స్థలం కేటాయించాలని కోరారు. ప్రభుత్వ భూమిలోని సర్వే నంబర్లు 21, 22, 23లో స్థలం కేటాయించాలని అధికారులను విజ్ఞప్తి చేశారు.

## పారాక్వాట్ పురుగుమందుపై 60 రోజుల నిషేధం

- ప్రజా ఆరోగ్యం, రైతుల భద్రత దృష్ట్యా ప్రభుత్వ నిర్ణయం

**మేడ్చల్ మల్కాజిగిరి, ఏప్రిల్ 02 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో పారాక్వాట్ పురుగుమందుపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 60 రోజుల పాటు తాత్కాలిక నిషేధం విధించింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు , తేది: 31.03.2026) తక్షణమే అమల్లోకి వచ్చినట్లు జిల్లా వ్యవసాయ అధికారి కె. చంద్రకల తెలిపారు.ఈ ఉత్తర్వుల ప్రకారం పారాక్వాట్ మరియు దాని అనుబంధ రసాయన ఫార్ములేషన్ల అమ్మకాలు, నిల్వ, పంపిణీ, తయారీ మరియు వినియోగంపై పూర్తి స్థాయి నిషేధం అమలులో ఉంటుంది.ఈ నిర్ణయానికి ప్రధాన కారణాలుగా ప్రజా ఆరోగ్యం, రైతుల రక్షణ, జంతువుల భద్రతను ప్రభుత్వం పేర్కొంది. పారాక్వాట్ వినియోగం వల్ల మనుషులకు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నట్లు నివేదికలు వెల్లడించాయి.వ్యవసాయ పనుల్లో దీన్ని వాడే రైతులకు ప్రమాదకరమని, అలాగే పశువులకు కూడా హానికరమని అధికారులు గుర్తించారు.ఇన్సెక్టిసైడ్స్ చట్టం, 1968లోని సెక్షన్ 27 ప్రకారం ఈ నిషేధాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.ఎవరైనా ఈ నిబంధనలను ఉల్లంఘించి పారాక్వాట్ విక్రయించినా లేదా నిల్వ చేసినా వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లాలోని ఎరువులు, పురుగుమందుల డీలర్లు, తయారీదారులు మరియు రైతులు ప్రభుత్వ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిషేధం అమలుపై వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం నిఘా ఉంచనున్నట్లు తెలిపారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in